# ఆత్మ సంబంధమైన ఎదుగుదలను ప్రోత్సహించుట (1:15, 16)

క్రైస్తవ్యం ఆరంభమైన మొదటి శతాబ్దంలో సహితం "నేను, నన్ను, నాది" అనే భావనలు సమస్యలను సృష్టించాయి. గనుక ఒకరితో నొకరు సంబంధం కలిగియుండుడని, ఒకరి యెడల ఒకరు అక్కర కలిగియుండుడని క్రైస్తవులకు మానక పౌలు జ్ఞాపకం చేస్తుండేవాడు. ఒకనినొకడు ప్రేమించుకొనండి, ఒకరియెడల ఒకరు కరుణాచిత్తులై యుండండి, ఒకరి నొకరు ప్రోత్సహించుకొనండి – అంటూ అతని పత్రికలు అనేక పిలుపులతో కూడినవై ఉంటాయి. ఫిలిప్పీ, కొరింథు, ఎఫెసు, రోము, థెస్సలొనీకవంటి ప్రాచీన ప్రపంచపు పెద్ద నగరాల్లో పౌలు పని చేశాడు. ప్రాథమికంగా నగరంలో ఉన్న క్రైస్తవులతో అతడు పని కలిగియున్నాడు. వారు నాగరికమైన వాతావరణంలో జీవించేవారు. అది వారిని ద్వీపాలుగా (యితరులతో పెక్కు సామాజిక సంబంధం అవసరం లేనట్టు) చేసేది.

మనవలెనే, మొదటి శతాబ్దపు క్రైస్తవులు కూడా కలిసియుండడం యొక్క విలువను గూర్చి ఎంతో ఎక్కువగా నేర్చుకొనవలసినవారైయున్నారు. సహవాసము, పరస్పర జాగరూకత, సొంతమైన దానికంటె సమాజమంతటి అవసరతను ముందుగా పెట్టడంవంటి సంగతులు వారు నేర్పించవలసియున్నారు. మనవలెనే, సమాజంగా జీవించడం, సహోదరులతో బాంధవ్యాలను పెంపొందించుకొనడం అనే విషయాలు మొదటి శతాబ్దపు క్రైస్తవులు ఎరుగనివారై యున్నారు.

నగర సంబంధమైన పరిస్థితుల్లో ఉన్న క్రైస్తవులకు పౌలు వ్రాస్తున్నాడు. లోకంలోని గొప్ప ప్రధాన నగర కేంద్రాల్లో వారు జీవిస్తూ ఉండేవారు. క్రీస్తు శరీరంగా జీవించడం ఎలాగో వారు నేర్చుకొనవలసినవారైయున్నారు.

ఉదాహరణకు, రోమాలోని క్రైస్తవులు ఒకరియెడల ఒకరు సహోదర ప్రేమయందు నిలకడగా ఉండవలసిన సంగతిని నేర్చుకొనవలసినవారైయున్నారు (రోమా 12:10). ఘనత విషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి (రోమా 12:10); ఒకనితో ఒకడు మనస్సు కలిసియుండుడి (రోమా 12:16), ఒకని కొకడు తీర్పు తీర్చకుడి (రోమా 14:13), ఒకని నొకడు చేర్చుకొనుడి (రోమా 15:7) అని పౌలు వారికి ఉపదేశించాడు. "సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయువాటినే ఆసక్తితో అనుసరింతము" అంటూ పౌలు వారిని ప్రోత్సహించాడు (రోమా 14:19).

వర్తక కేంద్రమైయున్న కొరింథులోని క్రైస్తవులు సహవాస భోజనం కొరకు కూడివచ్చు నప్పుడు, ఒకరి కొకరు కనిపెట్టుకొనియుండవలసినదిగా వారు నేర్చుకొనవలసినవారై ఉన్నారు (1 కొరింథీ. 11:33), తమకు యిష్టులైనవారిని బట్టి వారు విభజింపబడ కూడదనియు, ఒకరి పట్ల ఒకరు సమానమైన అక్కరగలవారై ఉండవలెననియు పౌలు వారికి బోధించాడు (1 కొరింథీ. 12:25).

మరొక మహా నగరమైన థెస్సలొనీకయలో, ఒకరినొకరు ప్రేమించుకోవాలని పౌలు క్రైస్తవులకు ప్రోత్సహించాడు (1 థెస్స. 4:9). ఒకరినొకరు ఆదరించుకోవాలనీ (1 థెస్స. 4:18), ఒకరినొకరు బలపరచుకోవాలనీ (1 థెస్స. 5:11) అతడు ఉపదేశించాడు. "మీరు ఒకనియెడల ఒకడును మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైనదానిని అనుసరించి నడుచుకొను"డని పౌలు వారికి చెప్పాడు (1 థెస్స. 5:15).

ప్రేమతో ఒకని నొకడు సహించుకొనుడనియు, ఒకని యెడల ఒకడు దయ కలిగి కరుణా హృదయులై ఒకరినొకరు క్షమించుకొనుడనియు (ఎఫెసీ. 4:2, 32) పౌలు ఎఫెసులోని క్రైస్తవులను హెచ్చరించాడు. ఒకని కొకడు లోబడి యుండుడని కూడా అతడు వారిని కోరాడు (5:21).

దేవుడు ప్రజల యొక్క నూతన సమాజంగా జీవించ నేర్చుకోవాలని క్రైస్తవులకు అప్పుడు ఏమి తెలిపాడో, అదే నేడును సంఘం వినవలసిన సమాచారమైయుంది. తన సాటి క్రైస్తవులతో తన వ్యక్తిగత సంబంధాలయందు ఏ మాదిరిని పౌలు కనుపరచాడో, మనం అదే మాదిరిని అనుసరింపవలసియుంది. అట్టిది మనం మనకొరకు నిర్మించుకున్న అల్పమైన ప్రపంచపు హద్దులను దాటి, యితరుల జీవితాలలో ఉపకారానికి అది సహాయపడగలదు.

ఒక క్షణంసేపు పౌలు యొక్క ఉదాహరణనే ఆలోచించు. అది క్రీ.శ. 60వ సంవత్సరం. అతడు రోములో తన అద్దె యింట బందీగా ఉండి, ఎఫెసులోని క్రైస్తవులకు ఎంతో దూరంగా ఉన్నాడు. ఉపదేశించుతూ, సేవ చేస్తూ, సంఘాన్ని కట్టుతూ – ఒకప్పుడు ఎఫెసులో మూడు సంవత్సరాలు గడిపాడు. ఏదియెలాగున్నా, కనీసం గత నాల్గు సంవత్సరాలుగా అతడు ఆ పట్టణాన్ని చూడలేదు.

చెరసాలగాని, కష్టాలుగాని, దూరంగాని, గతించిన కాలంగాని – ఏమియు ఎఫెసులో ఉన్న తన సహోదరులపట్ల తనకున్న ప్రేమను ఏ మాత్రమును తగ్గించలేదు. ఇతరుల జీవితాల్లో ఏమి జరుగుతున్న దాన్ని మినహాయించునట్లు, తన సమస్యలపై దృష్టిని కేంద్రీకరించేలా అతడు పరిస్థితులను రానివ్వలేదు.

ఎఫెసునుండి ఒక రోజున క్రైస్తవుడొకడు తన మార్గాన (పనిమీద) వచ్చాడు. అతడు పౌలును రోములో కనుగొన్నాడు. పౌలు అతన్ని కలుసుకున్నప్పుడు, ఎఫెసులోని సంఘాన్ని గూర్చి వినకుండ ఉండలేకపోయాడు. జనులు ఎలాగున్నారు? వారి మధ్య ఏమి జరుగుతుంది? దేవుని ప్రజలుగా వారు కూడుకుంటున్నారా? (అనే విషయాలు చర్చకు వచ్చినట్టున్నాయి).

పౌలు విన్న రిపోర్టు తన దినాన్ని వెలిగించింది. అతని హృదయం మిక్కిలి ఎత్తుగా ఆకాశానికి ఎగిరినంత పని అయ్యింది. అక్కడ యిలా చదువుతాం: "ఈ హేతువుచేత,

ప్రభువైన యేసునందలి విశ్వాసమునుగూర్చియు, పరిశుద్ధులందరి యెడల మీరు చూపుచున్న విశ్వాసమును గూర్చియు, నేను వినినప్పటినుండి మీ విషయమై మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" (1:15, 16).

చిత్రాన్ని నీవు చూచావా? ఎఫెసులోనున్న తన సహోదరులకు ఎన్నో మైళ్ల దూరంలో పౌలు ఖైదీగా ఉన్నాడు. వారి ముఖాలు నాల్గు దీర్ఘ సంవత్సరాలుగా చూడనేలేదు, అయినా పౌలు వారి విషయంలో గాఢమైన అక్కర కలిగియున్నాడు. ఈ పాఠం నేర్చుకొనడానికి పౌలు మనకు సహాయపడతాడు: **ఆత్మ సంబంధమైన అక్కరను క్రైస్తవులు ఒకరిపట్ల ఒకరు కనుపరచుకొనినప్పుడు వారు దేవుని ఆనందింపజేస్తారు.**

తన ప్రజలు ద్వీపాలుగా మారిపోవాలని ప్రభువైన యేసు కోరలేదు. ఒకరికి ఒకరం పరిచారం చేసికొనే జనంగా మనం రూపొందాలని ఆయన కోరుతున్నాడు. ఆత్మ సంబంధంగా యితరులు ఎదిగేలా చూడడానికి మనం ఎలాటి అభిలాషను, అక్కరను, కోర్కెను పెంపొందించుకోవాలో పౌలు ప్రదర్శించాడు.

## ఇతరుల ఆత్మ సంబంధమైన అభివృద్ధిని పౌలు మెచ్చుకున్నాడు

ఎఫెసీలోని క్రైస్తవులను గూర్చి పొందిన రిపోర్టు పౌలును ఉల్లసింపజేసింది. దేవుని ప్రజల మధ్య నిలిచియుండవలసిన సున్నితమైన పడికట్టు (తూకాన్ని) వారు సాధించారు. మొదటిగా వారు ప్రభువైన యేసుకు నమ్మకత్వాన్ని (స్వామి భక్తిని) ప్రదర్శించారు. "ప్రభువైన యేసునందలి విశ్వాసమును గూర్చి ..." తాను విన్నట్టు పౌలు వ్రాశాడు (1:15). వారు తమ విశ్వాసాన్ని ప్రభువైన యేసుపైనుంచి, తమ జీవితాలు జీవించడానికిని, తమ నిరీక్షణను నిర్మించుకొనడానికిని వచ్చియున్నారు. తమ రక్షకుడుగా మాత్రమే వారు ఆయన వద్దకు రావడం కాదు – "యేసు" అంటే అర్థం అదే – ఆయన ప్రభువు అని కూడా వారు ఆయన వద్దకు వచ్చారు. వారు తమ జీవితాలను ఆయనకు లోబరచు కుంటున్నారు, ఆయనకు లోబడుతున్నారు, ఆయనను ఆనందింపజేయ వెదకుతున్నారు. దేనిని బట్టి ఆయన ఘనపరచబడతాడో దానిపై వారు తమ దైనిక తీర్మానాలను చేసుకున్నారు.

కొంత కాలం క్రిందట, మా స్థానిక సంఘంలో ఒక పెద్ద వయస్సు మనిషి ప్రభువైన యేసుకు లోబడ వచ్చాడు. అతని వెంట్రుకలు తెల్లబారాయి కాని, ప్రభువునందు అతనికి పసిబిడ్డ హృదయంవంటి నమ్మిక ఉంది. బాప్తిస్మపు సమయంలో పాత జీవితం అంతరించి, నూతన జీవితం ఆరంభమౌతుందనే ఆలోచనను నీటిలో నిలిచిన అతనివంటి మనిషితో పంచుకొనడంవంటిది ఏదీ లేదు.

దానికంటెను యింకా ఎక్కువగా ఉల్లసింపజేసేదేమో తెలుసా? దేవుని పిల్లలలో ప్రభువైన యేసు చేసే మార్పును గమనించడం. ప్రభువైన యేసునందు నమ్మకం (స్వామి భక్తి) యితరుల జీవితాల్లో పెంపారుతున్న దానిని అభినందించ ఎన్నడు మానవద్దని పౌలు మనకు జ్ఞాపకం చేస్తున్నాడు. మనం మన సొంత చిన్న ప్రపంచంలోనే జీవిస్తుంటే,

మనం దీన్ని పోగొట్టుకుంటాం.

ఎఫెసీయులు ప్రభువైన యేసునందు స్వామి భక్తి కనుపరచడం మాత్రమే గాక, "పరిశుద్ధులందరి యెడల" కూడా వారు ప్రేమను కనుపరచుతున్నారు. "పరిశుద్ధులందరి యెడల మీరు ప్రేమను కనుపరచుచున్నా"రని పౌలు యింకను మాట్లాడాడు. ద్వీపంలా లేక శిలలా యితరుల అక్కరల పట్ల ఉండడం ప్రేమకు వ్యతిరేకమైయుంటుంది. "ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొను చున్నాము. మనముకూడా సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము" అని చదువుతాం (1 యోహాను 3:16).

ఆలాటి ప్రేమను వ్యక్తపరచడానికి క్రైస్తవులు నేర్చుకున్నప్పుడు, అది మనలను ఆనందంతో నింపవలసి ఉన్నది. అంటే, వారు ఆత్మ సంబంధమైన అభివృద్ధిని పొందుతున్నారని అర్థం. వారు ప్రభువైన యేసువలె మారుతున్నారని అర్థం. ఆయన పోలికను అదే కనుపరచుతుంది. ఆయన వారియందు జీవించుచున్నాడు.

ఈ ప్రేమ పరిశుద్ధులందరి యెడల ఉంది. అది యిష్టత చూపడానికి, మనుష్యులు మనకు ఏమి చేస్తారో దానిని బట్టి ప్రేమించడానికి, మనం ఏది యిష్టపడతామో దానినే యిష్టపడే జనులతో సహవాసం చేయడానికి అధిగమించి ఉంటుంది. పరిశుద్ధులందరి యెడల ప్రేమను కనుపరచే సహోదరునిగాని, సహోదరినిగాని మనం చూచినప్పుడు, మనం దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలసినవారమైయుంటాం.

## ఇతరుల ఆత్మ సంబంధమైన అభివృద్ధికొరకు పౌలు ప్రార్థించాడు

పౌలు, ఎఫెసీయుల విశ్వాసము, ప్రేమలను గూర్చి వినిన తరువాత, యిలా వ్రాశాడు: "మీ విషయమై మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను" (1:16). రెండు ముఖ్యమైన సత్యాలు పౌలు అర్థం చేసుకున్నాడు. మొదటిది, ఆత్మ సంబంధమైన ఎదుగుదలకును, ఒకరి కొరకు ఒకరు ప్రార్థించే క్రైస్తవులకును సంబంధమున్నట్టు అతడెరుగు. రెండవది, ఒకరి కొరకు ఒకరు ప్రార్థించడంలో నిలకడగా ఉండనవసరం ఉందని అతడు గ్రహించాడు.

తరువాత యిదే పత్రికలో, క్రైస్తవులు తమను తాము ఉన్నట్టు కనుగొనే ఆత్మ సంబంధమైన యుద్ధాన్ని గూర్చి పౌలు ఈ సహోదరులకు జ్ఞాపకం చేస్తాడు. సరియైన పరికరాలు లేకుండ సైనికుడు యుద్ధం చేయలేడు. ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పుతూ పౌలు ఈ పత్రికను ముగించబోతాడు: "**ఆత్మ**వలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" (6:18).

ఆత్మ సంబంధమైన ఎదుగుదలకును ఒకరి కొరకు ఒకరు ప్రార్థించడానికిని మధ్యగల సంబంధాన్ని పౌలు గ్రహించాడు. తన సహోదరుల కొరకు ప్రార్థించడం ప్రధానమైన పనిగా అతడు స్వయంగా చేసియున్నాడు. ప్రార్థనకును, క్రైస్తవుల క్షేమమునకును మధ్యగల

ముఖ్యమైన లింకును అతడు ఎరిగియున్నాడు.

సహోదరుల మధ్య ప్రార్థన అనే విషయాన్ని జినె ఎ. గెట్జ్ మాట్లాడాడు:

> ప్రార్థనకు మనం తగిన స్థానం యివ్వడంలో తప్పిపోయేలా సాతాను పన్నాగాలలో – పనులలో – మంచి పనులలో సహితము – మనలను నిమగ్నులుగా చేయడం ఒకటి. ప్రత్యేకించి సంగతులు అనుకూలంగా జరిగేటప్పుడు యిది సహజమైన తత్త్వమై ఉంటుంది. అయితే దేవుని ప్రాధాన్యతల జాబితాలో ప్రార్థన ఉన్నత స్థానంలో ఉంటుంది. మరియు ప్రార్థించడం తప్పిపోయినప్పుడు లేక అశ్రద్ధ చేయబడినప్పుడు, సంఘాన్ని దెబ్బతీయడానికి, అందులో ప్రత్యేకంగా ఐక్యతను దెబ్బతీయడం ద్వారా ప్రయత్నిస్తాడు.[1]

దీనినంతటిని జీవితం కొరకైన మూడు పాఠాలతో ముడివేద్దాం. (1) ఒకరి కొరకు ఒకరు ప్రార్థన చేయుటయందు నిలకడను మనం వృద్ధిచేసుకునే పర్యంతము, మనలో గూఢమైయున్న ఆత్మ సంబంధమైన శక్తి వద్దకు మనలో ఎవరిమైనా చేరుకోలేం. ఇతరుల కొరకైన ప్రార్థన ఆత్మ సంబంధమైన ఎదుగుదలను వృద్ధిచేస్తుంది, కనుపరచుతుంది కూడా. (2) సంఘముగా ఒకరి కొరకు ఒకరం ప్రార్థించడంలో నిలకడగా ఉండనంత మట్టుకు, సంఘ కుటుంబము తనయందు అణగియున్న శక్తిని ఎన్నడు చేరలేదు. ఇక్కడ దీని విషయంలో మనం పని చేయవలసి ఉంది. సంఘ కుటుంబాలుగా ప్రార్థించడానికి మనం ఏర్పాట్లు చేసుకోవాలి. మన కూడికలయందు ఒకరి కొరకు ఒకరు ప్రార్థించడాన్ని నొక్కి చెప్పాలి మరియు అలా ప్రార్థించడానికి అవకాశాలు కల్పించాలి. (3) ప్రార్థన ప్రాధాన్యతను ప్రజలు నిలుపుకోనంతవరకు ఒకరి కొరకు ఒకరు ప్రార్థన చేయడం నిలకడగా ఉండదు.

## ముగింపు

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో, విక్టర్ ఫ్రాంక్ కాన్‌సెంన్‌ట్రేటెడ్ క్యాంప్‌లో ఖైదీ చేయబడ్డాడు. తన్ను బంధించినవారు తన వద్దనుండి సమస్తం తన పుస్తకాలు, తన విలువైన వస్తువులు, తన కుటుంబాన్ని సహా తీసివేసారు. అతడు జీవించడానికి యికను ఏమీలేదు. సజీవంగా ఉండాలనే మొండి తీర్మానం తప్ప, అతన్ని జీవింపజేయడానికి ఏ ఆధారమూ లేదు.

ఆ ఖైదులో అనేకులు ఆశలు వదలుకొని చనిపోయారు. జనులు తమ కష్టాలను సహించగలుగునట్లు ఓదార్పు మాటలు చెప్పుమని యితరులు ఫ్రాంక్‌ను అడిగారు. చివరికి, ఫ్రాంక్ ఆ పని చేశాడు. నిబ్బరం కలిగి ఉండుడని అతడు ప్రజలకు చెప్పాడు. రేపటి దినం వారు తన సూపు (పులుసు – చారు) పొందేటప్పుడు, ఆ గిన్నె అడుగున ఒక బఠాణి గింజను కనుగొనవచ్చునని అతడు వారికి గుర్తు చేశాడు. అది అల్పమైన నిరీక్షణయే అయినా ఫ్రాంక్ దానిని వారికి యివ్వగలిగాడు.

ఏమి జరిగిందో నీకు తెలుసా? తన మాటలవలన ఎక్కువ ప్రోత్సాహాన్ని పొందినవాడు ఫ్రాంకే. అతడు యితరులకు ఏమి యిచ్చాడో, అదే తనకు యిచ్చుకున్నాడు.

క్రీస్తునందు మనం ఒకరి కొకరం యిచ్చుకునేది, మనం మనకే యిచ్చుకున్న

వారమౌతాం. ఎవరినైనా ప్రోత్సహించు, నీవు దానితో ప్రోత్సహింపబడతావు. ఒకనికి సహాయం చేయి. అది నీకు సహాయం చేస్తుంది. ఇతరుల భారాన్ని భరించు, అప్పుడు నీ భారమే నీకు తేలికౌతుంది. మరొక క్రైస్తవుని ఆత్మ సంబంధమైన అభివృద్ధికొరకు ప్రార్థించు, ఆత్మ సంబంధంగా నీవు వృద్ధిపొందినట్టు కనుగొంటావు.

---

సూచనలు

[1]Gene A. Getz, *Praying for One Another* (Wheaton, Ill.: Victor Books, 1981), 15.